

http://amaravathivelugu.com

RNI No. : APTEL/2022/85169

అమరావతి వెలుగు

సంచలన తెలుగు దినపత్రిక

రిపోర్టర్లు కావలెను

పాత్రికేయులుగా పని చేయాలన్న ఉత్సాహం
మీ ప్రాంత స్థితిగతులపై అవగాహన
తెలుగులో రాయగలిగిన భాషా పరిజ్ఞానం ఉన్న
ఔత్సాహికులకు ఇదే మా ఆహ్వానం

అనంతపురం జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాల్లో
న్యూస్ కంట్రిబ్యూటర్లు కావలెను.
విషయ పరిజ్ఞానంతో పాటు సామాజిక,
రాజకీయ అవగాహన కలిగి స్థానికులై ఉండాలి.
వివరాలకు సంప్రదించండి :
జానపాటి వెంకట రమేష్ బాబు ఎడిటర్
9440814576

సంపుటి : 04 సంచిక : 174 ప్రచురణ : శ్రీ సత్యసాయి/అనంతపురం ఎడిటర్ : జానపాటి వెంకట రమేష్ బాబు ఆదివారం, అక్టోబరు 25, 2026 పేజీలు : 4 వెల : ₹2/-

Circulated at Guntur, Palnadu, Bapatla, Chittoor, Tirupati, Madanapalli, Kurnool, Nandyal, Visakapatnam, Vijayawada, Kadikana, Kadapa, Nellore, Rajamendravaram



ఉత్తరప్రదేశ్‌లో వేడెక్కిన... సీట్ల పంచాయితీ..!!


- కాంగ్రెస్‌కు మరో ఆఫర్ ఇచ్చిన ఎస్పీ?
- యూపీలో మొత్తం ఎన్ని అసెంబ్లీ స్థానాలు?
- ఎన్నికలు ఎప్పుడు జరగనున్నాయి?
- కాంగ్రెస్-ఎస్పీ మధ్య సీట్ల పంచాయితీ?
- బరిలో ఉండే ప్రధాన పార్టీలు ఏవి?
- గత ఎన్నికల ఫలితాలు ఏం చెబుతున్నాయి?
- యూపీ ఎన్నికలపై దేశవ్యాప్తంగా ఆసక్తి ఎందుకు?


2

దీపేకాలాంటివారు వస్తారు.. అందరినీ కన్ఫ్యూజ్ చేస్తారు...!!

: గోయల్ వ్యాఖ్యలు వైరల్

విదేశాల్లో ఉన్న భారతీయ టాలెంట్‌ను తిరిగి స్వదేశానికి రప్పించేందుకు తమ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. ప్రస్తుతం ఐరోపా పర్యటనలో ఉన్న ఆయన జర్మనీలో భారతీయ విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీపేకా పై విమర్శలు





వాయుగుండంగా మారనున్న అల్పపీడనం..!!

వాయుగుండంగా మారనున్నట్లు భారత వాతావరణ శాఖ వెల్లడి

ఆదివారానికి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశముంది

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తుపానుగా రూపాంతరంగా మారనుంది

రెండు రోజులకు ఆంధ్ర-ఒడిశా తీరాల వైపు కదలొచ్చు : వాతావరణ శాఖ

విశాఖ: తూర్పు మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన అల్పపీడనం మరింత బలపడింది. శనివారం అదే ప్రాంతంలో కొనసాగుతూ.. వాయుగుండంగా మారనున్నట్లు భారత వాతావరణ శాఖ తెలిపింది. అనంతరం ఇది పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ ఆదివారానికి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశముంది. సోమవారానికి మరింత బలపడి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తుపానుగా రూపాంతరం చెందే అవకాశముంది. ఇది మరింత బలపడి తదుపరి రెండు రోజులకు ఆంధ్ర-ఒడిశా తీరాల వైపు కదలొచ్చని వాతావరణ శాఖ పేర్కొంది. ఈ ప్రభావంతో శనివారం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురవనున్నాయి. సోమవారం కోస్తాంధ్రలో అక్కడక్కడ ఓ మోస్తరు వర్షాలు, మంగళ, బుధవారాల్లో భారీ నుంచి అతి భారీవర్షాలు కరవనున్నాయి. తుపాను తీరం దాటే సమయంలో కుండపోత వర్షం, ప్రచండ గాలులు వీయొచ్చని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.



గుత్తేదారు రోడ్డు నిర్మాణ పనుల నిమిత్తం జిలెటెన్ స్టిక్స్ తీసుకుళ్తున్న సమయంలో పేలుడు సంభవించింది

ఉదయం పినకోట వద్ద మైనింగ్ ప్రాంతంలో భారీ పేలుడు

వాహనంలో డీజిల్ నింపుతుండగా మంటలు అంటుకుని సంభవించిన పేలుడు

మృతుల్లో డ్రైవర్, ముగ్గురు కార్మికులు ఉండగా.. ఓ ఉపాధ్యాయురాలు కూడా..

టీచర్ సునీత పాఠశాలకు వెళ్తున్న సమయంలో బొలెరో వాహనంలో ప్రయాణిస్తున్నారు

టిప్పర్‌కు డీజిల్ నింపుతుండగా జిలెటిన్ స్టిక్స్ ఒక్కసారిగా పేలాయి

మండల కేంద్రానికి సుమారు 90 కిలోమీటర్ల దూరంలో ప్రమాదం

అల్లూరి జిల్లా : జిల్లాలోని అనంతగిరి మండలంలో ఘోర ప్రమాదం జరిగింది. ఈరోజు (శనివారం) ఉదయం పినకోట వద్ద మైనింగ్ ప్రాంతంలో భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. వాహనంలో డీజిల్ నింపుతుండగా మంటలు అంటుకుని పేలుడు జరిగింది. మృతుల్లో డ్రైవర్, ముగ్గురు కార్మికులు ఉండగా.. ఓ ఉపాధ్యాయురాలు కూడా ప్రాణాలు కోల్పోయారు. టీచర్ సునీత పాఠశాలకు వెళ్తున్న సమయంలో బొలెరో వాహనంలో ప్రయాణిస్తున్నారు. వాహనం నుంచి టిప్పర్‌కు డీజిల్ నింపుతుండగా మంటలు అంటుకొని రహదారి నిర్మాణానికి తీసుకెళ్తున్న జిలెటిన్ స్టిక్స్ ఒక్కసారిగా పేలాయి. ఈ ప్రమాదంలో మృతుల శరీర భాగాలు చిన్నాభిన్నమయ్యాయి. అనంతగిరి మండల కేంద్రానికి సుమారు 90 కిలోమీటర్ల దూరంలో ప్రమాదం చోటు చేసుకుంది. గుత్తేదారు రోడ్డు నిర్మాణ పనుల నిమిత్తం జిలెటెన్ స్టిక్స్ తీసుకుళ్తున్న సమయం లో పేలుడు సంభవించింది. సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

మృతులు వీరే.. టీచర్ సునీత (విశాఖపట్నం), కార్మికుడు మణి (దేవరపల్లి), కార్మికుడు నారాయణరావు (చీడికాడ), కార్మికుడు పవన్ కుమార్ (కడప), వీరితో పాటు డ్రైవర్ మృతి చెందిన వారిలో ఉన్నారు.. మిగిలిన వారి వివరాలు తెలియాల్సి ఉంది.

పేలుడు ఘటన అత్యంత బాధాకరం
: హోం మంత్రి

అనంతగిరి మండలం పినకోట ప్రాంతంలో పేలుడు ఘటనపై హోం మంత్రి వంగలపూడి అనిత స్పందించారు. పినకోట ప్రాంతంలో పేలుడు ఘటనపై ఆరా తీశారు. అల్లూరి జిల్లా కలెక్టర్, ఎస్పీ తో ఫోన్‌లో మాట్లాడారు. పేలుడు ఘటన జరగడం అత్యంత బాధాకరమని హోం మంత్రి అన్నారు. పేలుడు ఘటనలో మృతి చెందిన వారి పట్ల తీవ్ర సంతాపం తెలిపారు. ప్రమాదంలో గాయ పడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఘటనాస్థలిలో బాధితులకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలన్నారు. ప్రమాద బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హోం మంత్రి అనిత హామీ ఇచ్చారు.



ఏపీ బ్రాండ్‌పై ఆందోళన కలిగించేలా... జగన్ చర్యలు..!!

రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్య ఒకప్పుడు బాహ్య శక్తుల నుంచి వచ్చేది

ఇప్పుడు ఆ సమస్య ఓ రాజకీయ పార్టీ నుంచి వస్తోంది

శాంతి భద్రతల సమస్యలు సృష్టించిన రాష్ట్రాలు అభివృద్ధికి నోచుకోలేదు

2019-24 మధ్య విధ్వంసం పరాకాష్ఠకు చేరింది...
తెలుగు జాతి మొత్తం తిరుగుబాటు చేసే పరిస్థితిని
గత వైకాపా పాలకులు తెచ్చారు
నేరాలు, రౌడీయిజం చేసేవారిని ప్రజలు హర్షించరు..

- అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోంది
- కాంగ్రెస్ పార్టీ, వైఎస్ మనస్తత్వంతో పోల్చితే జగన్‌ది భిన్న మనస్తత్వం
- స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకునేందుకు 59 పిటిషన్లు వేశారు
- బీసీ రిజర్వేషన్లు అడ్డుకునేందుకు అన్ని విధాలా ప్రయత్నించారు
- బీసీల రిజర్వేషన్ల కోసం సుప్రీంకోర్టు వరకూ వెళ్లి పోరాడాం
- ఎక్కడ అవకాశం ఉంటే.. అక్కడ బీసీలకు సీట్లు ఇచ్చాం
- రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో దౌర్జన్యాలకు పాల్పడింది
- రాష్ట్రం తగులబడినా.. తమ అజెండా నెగ్గాలన్నది వైకాపా ఆలోచన
- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

..2వ పేజీలో

జగన్ అరాచకాలపై చర్చ జరగాలి..

"జగన్ పార్టీ చేస్తోన్న హింస, చెబుతున్న అబద్ధాలు, అరాచకాలపై ప్రజల్లో చర్చ జరగాలి. ఫేక్ ప్రచారం చేసి కోర్టులకు వెళ్తూ.. క్రిమినల్ లిటిగెంట్లుగా మారుతున్నారు. కోర్టులకు కూడా తప్పుడు సమాచారం ఇస్తున్నారు. రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడుతున్నారు. ఆంధ్రప్రదేశ్ బ్రాండ్‌పై ఆందోళన కలిగించేలా జగన్ చర్యలు ఉన్నాయి" అని చంద్రబాబు ధ్వజమెత్తారు.



అమరావతి: రాష్ట్రంలో శాంతి భద్రతల సమస్య ఒకప్పుడు బాహ్య శక్తుల నుంచి వచ్చేదని సీఎం చంద్రబాబు అన్నారు. ఇప్పుడు ఆ సమస్య ఓ రాజకీయ పార్టీ నుంచి వస్తోందని విమర్శించారు. నేతలు నేరాలు చేస్తూ.. శాంతి భద్రతల సమస్యలు సృష్టించిన రాష్ట్రాలు అభివృద్ధికి నోచుకోలేదని పేర్కొన్నారు. ఉండవల్లిలోని పార్టీ కార్యాలయంలో చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. "2019-24 మధ్య విధ్వంసం పరాకాష్ఠకు చేరింది. తెలుగు జాతి మొత్తం తిరుగుబాటు చేసే పరిస్థితిని గత వైకాపా పాలకులు తెచ్చారు. నేరాలు, రౌడీయిజం చేసేవారిని ప్రజలు హర్షించరు. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. కాంగ్రెస్ పార్టీ, వైఎస్ మనస్తత్వంతో పోల్చితే జగన్‌ది భిన్న మనస్తత్వం. ఆయన మనస్తత్వం రాష్ట్రానికే ప్రమాదం. స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకునేందుకు 59 పిటిషన్లు వేశారు. బీసీ రిజర్వేషన్లు అడ్డుకునేందుకు అన్ని విధాలా ప్రయత్నించారు. ఆర్థిక నిధులు రాకుండా స్థానిక సంస్థల ఎన్నికలను



అన్నదాత సుఖీభవ నిధుల విడుదలకు లైన్ క్లియర్..!!

ఏపీలోని రైతులకు త్వరలో ప్రభుత్వం శుభవార్త అందించనుంది

రెండో విడత నిధులు త్వరలో విడుదలయ్యే అవకాశముంది

అక్టోబర్ 17న ఈ నిధులు విడుదల కావాల్సి ఉండగా..

కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా పడ్డాయి...

పస్తుతం దీపావళికి ముందే డబ్బులను రైతుల ఖాతాల్లో

జమ చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది

..2వ పేజీలో

ఏపీలోని రైతులకు త్వరగా శుభవార్త అందనుంది. అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకాల ద్వారా రెండో విడత నిధులు త్వరలో విడుదలయ్యే అవకాశముంది. అక్టోబర్ 30వ తేదీన పీఎం కిసాన్ నిధులు విడుదలయ్యే అవకాశముండగా.. అన్నదాత సుఖీభవ నిధులు కూడా అదే రోజు రిలీజ్ అయ్యే చాన్స్ ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 40 లక్షల మందికి

అన్నదాత సుఖీభవ నిధుల విడుదలకు లైన్ క్లియర్..!!

(మొదటిపేజీ తరువాయి) పైగా రైతులు ఈ నిధుల కోసం ఎదురుచూస్తున్నారు. అక్టోబర్ 17న ఈ నిధులు విడుదల కావాల్సి ఉండగా.. కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా పడ్డాయి. ప్రస్తుతం దీపావళికి ముందే అక్టోబర్ 30వ తేదీన ఈ డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. అన్నదాత సుఖీభవ కింద రూ.4 వేలు జమ కానుండగా.. పీఎం కిసాన్ కింద రూ.2 వేలు కలిపి ఏపీ రైతుల ఖాతాల్లో ఒకేసారి రూ.6 వేలు జమ అవుతాయి. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్‌కు తొలి విడత డబ్బులను జూన్ 20వ తేదీన రిలీజ్ చేశారు. ఇప్పుడు రెండో విడత నిధులను విడుదల చేయడానికి రంగం సిద్ధమవుతోంది. ఈ పథకం కేవలం భూమి ఉన్న రైతులకు మాత్రమే కాకుండా.. భూమి లేని కౌలు రైతులకు కూడా వర్తిస్తుంది. కౌలు రైతులురైతు భరోసా కేంద్రాలలో సీసీఆర్‌సీ (క్రాప్ కల్టివేషన్ రైట్స్ కార్డ్) తీసుకోవాల్సి ఉంటుంది. సీసీఆర్‌సీ కార్డు ఉన్న కౌలు రైతులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందవచ్చు.. ఈ కార్డు లేని రైతులకు డబ్బులు అందే అవకాశం లేదు. కౌలు రైతులు తమ భూ యజమానితో మాట్లాడి సీసీఆర్‌సీ కార్డును పొందాలని ప్రభుత్వం సూచిస్తోంది. అన్నదాత సుఖీభవ స్టేటస్ తెలుసుకోవడం ఎలా..?. "అన్నదాత సుఖీభవ" అని వెబ్ సైట్ ఓపెన్ చేయండి "నో యువర్ స్టేటస్" అనే ఆప్షన్ ఎంచుకోండి... ఆధార్ నంబర్, క్యాప్చా ఎంటర్ చేసి మీ పేరు ఉందో లేదో తెలుసుకోవచ్చు. పీఎం కిసాన్ స్టేటస్ తెలుసుకోండిలా..? పీఎం కిసాన్ వెబ్ సైట్ https://pmkisan.gov.in/ తెరవండి "నో యువర్ స్టేటస్" అనే ఆప్షన్ ఎంచుకోండి.. రిజిస్ట్రేషన్ నంబర్, క్యాప్చా ఎంటర్ చేసి గెట్ ఓటీపీపై క్లిక్ చేయండి.. ఓటీపీ ఎంటర్ చేసి సబ్మిట్ చేయండి... అనంతరం మీ స్టేటస్ వివరాలు స్క్రీన్‌పై కనిపిస్తాయి

ఇవి అప్డేట్ చేసుకోండి.. నిధులు సజావుగా ఖాతాల్లో జమ కావడానికి రైతులు కొన్ని ముఖ్యమైన అప్‌డేట్‌లను చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. మీ బ్యాంక్ ఖాతాకు NPCI లింక్ చేయబడిందా లేదా తనిఖీ చేసుకోవాలి. అలాగే ఫార్మర్ ఐడీ రిజిస్ట్రేషన్, వఖ్జ పూర్తి అయ్యాయో లేదో నిర్ధారించుకోవాలి. ఈ అప్‌డేట్‌లన్నీ చేసుకున్న రైతుల ఖాతాల్లోకి నిధులు జమ అవుతాయి.

ఏపీ బ్రాండ్‌పై అందోళన కలిగించేలా జగన్ చర్యలు..!!

(మొదటిపేజీ తరువాయి) అడ్డుకునేందుకు యత్నిస్తున్నారు. బీసీల రిజర్వేషన్ల కోసం సుప్రీంకోర్టు వరకూ వెళ్లి పోరాడాం. ఎక్కడ అవకాశం ఉంటే.. అక్కడ బీసీలకు సీట్లు ఇచ్చాం"

వైకాపావి క్రిమినల్ పాలిటిక్స్.. "వైకాపా క్రిమినల్ పాలిటిక్స్ చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో దౌర్జన్యాలకు పాల్పడింది. ఓ ఎంపీ వాహనంతో ఎన్డీయే కార్యకర్తను తొక్కించారు. పుంగనూరు, రాయచోటి, కనిగిరి, దర్శి, కడప, తంబళ్లపల్లె, తిరుపతితో పాటు పలు ప్రాంతాల్లో అరాచకం సృష్టించారు. రాష్ట్రం తగులబడినా.. తమ అజెండా నెగ్గాలన్నది వైకాపా ఆలోచన" అని చంద్రబాబు మండిపడ్డారు.

జగన్ కంసమామ.. "మేనకోడలి పెళ్లి ఆపి జగన్ కంసమామగా తయారయ్యారు. షర్మిల కుమార్తె పెళ్లికి ఆహ్వాన పత్రికలు పంచాక పెళ్లికి అడ్డుపడ్డారు. సొంత చెల్లి పట్ల జగన్ అనుసరిస్తున్న తీరును ప్రజలు అర్థం చేసుకోవాలి" అని చంద్రబాబు అన్నారు. ఈ సందర్భంగా వైకాపా హింసాత్మక ఘటనల వీడియోలను చంద్రబాబు ప్రదర్శించారు. "అదే హింస.. అవే అబద్ధాలు.. అవే అరాచకాలు" పేరుతో బుక్‌లెట్ విడుదల చేశారు.

స్వామి చిన్మయానంద ఏఐ రూపంతో
ప్రధాని మోదీ సంభాషణ

దిల్లీలో 'చిన్మయ అమృత్ మహోత్సవ్ గ్లోబల్ సమ్మేళన్'ను ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఏఐ ఆధారిత త్రీడీ హోలోగ్రఫిక్ డిజిటల్ రూపంలో కనిపించిన స్వామి చిన్మయానందతో ప్రధాని సంభాషించారు. "1993లో నేను కలిసిన వ్యక్తి నేడు ప్రధానిగా దేశానికి సేవలందించడం ఆనందంగా ఉంది. మీకు ప్రసాదంగా శ్రీఖండ్ అందించాలని భక్తులకు చెప్పా. దాన్ని తినండి. ఈరోజు ఉపవాసం ఉన్నానని మాత్రం చెప్పకండి" అని స్వామి అనగా మోదీ నవ్వుతూ స్పందించారు. "నా నవరాత్రి ఉపవాసాలు ముగిశాయి. శ్రీఖండ్‌ను తప్పక స్వీకరి స్తాను. మీరు ఉపదేశించిన మార్గంలో నడవడానికి ప్రయత్నిస్తాం" అని ప్రధాని అన్నారు.



నిరసనలను వాయిదా వేయండి..


రాహుల్ గాంధీకి ఢిల్లీ వ్యాపారుల విజ్ఞప్తి

భారత ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు వ్యతిరేకంగా నవంబర్ 1న రామ్‌లీలా మైదానంలో ఇండి కూటమి తలపెట్టనున్న నిరసన కార్యక్రమాలను వాయిదా వేయాలని కోరుతూ ఢిల్లీ వ్యాపారులు.. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి బహిరంగ లేఖ రాశారు. పండగ సీజన్‌లో ఈ ఆందోళనలు నిర్వహించడం వల్ల తమకు అక్షరాలా పది వేల కోట్ల రూపాయల నష్టం వాటిల్లుతుందని ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ మేరకు వ్యాపారుల తరఫున ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సీటీఐ).. నిరసనలు వాయిదా వేయాలని విజ్ఞప్తి చేసింది. భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా విపక్షాలు నిరసనకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. అయితే దీపావళి పండగ సమీపిస్తున్న వేళ.. ఈ నిరసనలు వ్యాపారాలను తీవ్రంగా దెబ్బతీస్తాయని సీటీఐ అందోళన వ్యక్తం చేస్తోంది. దీపావళి షాపింగ్ కోసం ప్రజలు దేశం నలుమూలల నుంచి ఢిల్లీకి వస్తారని, ఇక్కడ రూ.25 వేల కోట్ల వరకు వ్యాపారం జరుగుతుందని చెబుతోంది. అయితే పండగ సీజన్‌లో ఇలాంటి కార్యక్రమాల కారణంగా తమకు రూ.10,000 కోట్ల వరకు నష్టం వస్తుందని ఆవేదన చెందుతోంది. ఇప్పటికే అక్టోబర్‌లో జరిగిన నిరసనల వల్ల వ్యాపారులకు రూ.3000 కోట్ల మేర నష్టాలు వచ్చాయని వాపోయింది. అందుకే సీఈసీ వ్యతిరేక ర్యాలీని వాయిదా వేయాలని వర్తక సంఘం కోరింది. నవంబర్ 1న నిరసనలు నిర్వహిస్తే రామ్‌లీలా మైదానం పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు, బారికేడ్లు, మెట్రో స్టేషన్ల మూసివేత వంటి చర్యలు ఉంటాయని, ఇవి వ్యాపారాలను తీవ్రంగా ప్రభావితం చేస్తాయని ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ చైర్మన్ బ్రిజేష్ గోయల్ తెలిపారు. అందుకే ఈ కార్యక్రమాలను నవంబర్ 10 తరువాత చేపట్టాలని రాహుల్ గాంధీని కోరారు.

ఏఐ మోడళ్ల మళ్లీ శిక్షణ..

ఈసారి ఇంటర్నెట్ లేకుండా..: ఓపెన్‌ఏఐ

తమ అడ్వాన్స్‌డ్ ఏఐ మోడళ్ల శిక్షణను తిరిగి ప్రారంభించినట్లు ప్రముఖ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంస్థ ఓపెన్‌ఏఐ ప్రకటించింది. అయితే, ఈసారి ఏఐ మోడళ్లు అదుపు తప్పకుండా ఉండేందుకు అవసరమైన భద్రతా చర్యలు తీసుకున్నట్లు వెల్లడించింది. శిక్షణ సమయంలో లైవ్ ఇంటర్నెట్ యాక్సెస్ సదుపాయాన్ని నిలిపివేసినట్లు ప్రకటించింది. దీనివల్ల అనుమతి లేకుండా ఏఐ ఏజెంట్లు బాహ్య వ్యవస్థల్లోకి చొరబడే ప్రమాదం తప్పనుందని పేర్కొంది. ఈ ఏఐ ఏజెంట్లు అదుపుతప్పి ప్రవర్తిస్తున్నాయనే నివేదికలు రావడంతో గత నెలలో ఓపెన్‌ఏఐ వీటికి శిక్షణను తాత్కాలికంగా నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఈ తప్పిదాలకు కారణాలను గుర్తించి సరిచేసిన అనంతరం ఇప్పుడు మళ్లీ ట్రైనింగ్ ప్రారంభించినట్లు కంపెనీ తెలిపింది. ఇంటర్నెట్ మౌలిక సదుపాయాల భద్రతను దృష్టిలో ఉంచుకుని శిక్షణ సమయంలో ఏఐ ఏజెంట్లకు ఇంటర్నెట్ యాక్సెస్ ఇవ్వకూడదని నిర్ణయించినట్లు వెల్లడించింది. ఏఐ ఏజెంట్లు కోడింగ్ చేయడం, సాఫ్ట్‌వేర్ ప్రాక్టీస్ వంటి పనుల కోసం బాహ్య నెట్‌వర్క్‌తో సంబంధం లేని ప్రత్యేకమైన ఆఫ్‌లైన్ డిజిటల్ శాండ్ బాక్స్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపింది.



స్థానిక ఎన్నికల్లో వైసీపీ అరాచకాలపై ఎస్ఈసీకి కూటమి నేతల ఫిర్యాదు

విజయవాడ : ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ సృష్టించిన అరాచకాలపై రాష్ట్ర ఎన్నికల సంఘానికి (ఎస్ఈసీ) కూటమి నేతలు వర్ల రామయ్య, చిల్లపల్లి శ్రీనివాస్, పాతూరి నాగభూషణం ఫిర్యాదు చేశారు. ప్రజలు అంగీకరించకపోవడంతో, స్థానిక సంస్థల ఎన్నికలను ఎలాగైనా ఆపేందుకు వైసీపీ కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. నామినేషన్ పత్రాలను వారే చించుకుని, బారికేడ్లు పడేసి, పోలీసులపై దాడులు చేస్తూ వైసీపీ నేతలు దొంగ నాటకాలు ఆడుతున్నారని కూటమి నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ గ్యాంగ్ వ్యవహారశైలి స్టూవర్టుపురం, కంజరభట్ ముఠాల తరహాలో తయారైందని విమర్శించారు. మున్సిపాలిటీల్లో 8,128, జెడ్పీటీసీల్లో 1,815, ఎంపీటీసీల్లో 20,556 స్థానాల్లో వైసీపీ నామినేషన్లు వేసిందని.. మరి వాళ్లను ఎక్కడ అడ్డుకున్నట్లు అని కూటమి నేతలు ప్రశ్నించారు. ఐదున్నరేళ్లుగా జగన్ మోహన్ రెడ్డి ఒక్కసారి కూడా ప్రెస్‌మీట్ ఎందుకు పెట్టలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వైసీపీ ఆరాచకాలకు సంబంధించిన ఆధారాలను పెన్ డ్రైవ్‌లో రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు ఇచ్చామని.. సిట్ వేసి విచారించాలని కోరామని చెప్పారు. ఎన్నికలు ఆగిపోతే పంచాయతీలు, స్థానిక సంస్థలకు ఏటా వచ్చే రూ.15 వేల కోట్ల నిధులు ఆగిపోయే ప్రమాదం ఉందన్నారు. ఎన్నికలు జరిగితే కూటమి గెలుస్తుందనే భయంతోనే, రాయలసీమ, ప్రకాశం జిల్లాలో వైసీపీ కావాలనే గొడవలు సృష్టిస్తోందని కూటమి నేతలు ఆరోపించారు.



దీపేకలాంటివారు వస్తారు..
అందరినీ కన్ఫ్యూజ్ చేస్తారు...!!

(మొదటిపేజీ తరువాయి) చేశారు. "మనం ఎక్కడికి వెళ్లినా.. అక్కడ భారీ సంఖ్యలో భారత ప్రతిభావంతులు ఉంటారు. వారిని స్వదేశానికి ఎలా రప్పించాలి..? అలా రప్పించే క్రమంలో ఎలాంటి తప్పులు జరగకుండా చూసుకోవాలి..? దీనిపై ఏమైనా ఆలోచనలు ఉంటే చెప్పండి. భారత టాలెంట్ తిరిగి స్వదేశానికి రావడాన్ని ఆర్థికపరమైన అంశంగానే చూడొద్దు. మీ ప్రయాణంలో మాతృభూమికి కొంత స్థానం ఇవ్వాలని సూచిస్తున్నా. అయితే, ఈ ప్రతిభావంతులను రప్పించే అంశంలో ప్రజాస్వామ్యానికి, నిరకుంశత్వానికి మధ్య తేడా ఉంటుంది. స్వదేశీ టాలెంట్‌ను వెనక్కి తీసుకొచ్చేందుకు చైనా ప్రయత్నాలు చేస్తోంది. అలా వచ్చిన వారు ఎవరైనా అక్కడి ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తే.. అనూహ్యంగా అదృశ్యమవుతారనే వార్తలు మనం చూస్తూనే ఉంటాం. కానీ భారత్‌కు తిరిగొచ్చిన వారు ప్రశ్నిస్తే.. నేను అదృశ్యమవుతాను" అని గోయల్ చమత్కరించారు. "ఇక, ప్రతిభావంతులు తిరిగొచ్చే క్రమంలో కొన్ని తప్పులు కూడా జరుగుతుంటాయి. అభిజీత్ దీప్కే లాంటివారు వచ్చి, విద్యార్థులకు నిధులు ఇవ్వడం, స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయడం ప్రభుత్వం బాధ్యత అంటారు. అవన్నీ మేమే ఎందుకు చేసుకోవాలని ప్రశ్నిస్తారు. దురదృష్టవశాత్తూ అలాంటివారు వచ్చి మనల్ని గందరగోళానికి గురిచేస్తారు. కాబట్టి ప్రజాస్వామ్య వ్యవస్థ కోణం నుంచే మన విధానాలను సిద్ధం చేసుకోవాలి" అని గోయల్ వ్యాఖ్యానించారు. అమెరికాలో చదువుకున్న అభిజీత్ దీప్కే.. నీట్ పేపర్ లీక్ నిరసనల సమయంలోనే సీజేపీని ఏర్పాటు చేశారు. ఆ తర్వాత స్వదేశానికి తిరిగి వచ్చి, పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా ఆందోళనలు చేపట్టారు. దాంతో కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చింది.



సంపాదకీయం

ఉత్తరప్రదేశ్‌లో వేడెక్కిన సీట్ల పంచాయితీ..!!

కాంగ్రెస్‌కు మరో ఆఫర్ ఇచ్చిన ఎస్పీ?

యూపీలో మొత్తం ఎన్ని అసెంబ్లీ స్థానాలు?...ఎన్నికలు ఎప్పుడు జరగనున్నాయి?

కాంగ్రెస్-ఎస్పీ మధ్య సీట్ల పంచాయితీ?...బరిలో ఉండే ప్రధాన పార్టీలు ఏవి?

గత ఎన్నికల ఫలితాలు ఏం చెబుతున్నాయి?...యూపీ ఎన్నికలపై దేశవ్యాప్తంగా ఆసక్తి ఎందుకు?

దేశంలోనే అతిపెద్ద రాష్ట్రం ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు 2027లో జరగనున్న నేపథ్యంలో రాష్ట్ర రాజకీయాలు ఇప్పటి నుంచే వేడెక్కాయి. భారతీయ జనతా పార్టీని అధికారానికి దూరం



చేయాలనే లక్ష్యంతో సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ), కాంగ్రెస్ కలిసి ముందుకు సాగాలని భావిస్తున్నాయి. అయితే.. సీట్ల పంపకమే ఈ రెండు పార్టీల మధ్య కీలక చర్చగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ ఎక్కువ స్థానాల్లో పోటీ చేయాలని చూస్తుండగా, ఎస్పీ మాత్రం తన బలానికి అనుగుణంగా సీట్ల కేటాయింపులు ఉండాలని భావిస్తున్నాయి.. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు 2027 సమీపిస్తున్న వేళ సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ), కాంగ్రెస్ మధ్య సీట్ల పంపకం చర్చలు ఆసక్తికరంగా మారుతున్నాయి. కాంగ్రెస్ 200కు పైగా స్థానాల్లో పోటీ చేయాలని కోరుకుంటోంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో ఆరు స్థానాలు గెలుచుకున్న విజయాన్ని కాంగ్రెస్ తన వాదనకు ఆధారంగా చూపుతోంది. మరోవైపు, గత ఎన్నికల్లో కాంగ్రెస్ పనితీరును పరిగణనలోకి తీసుకుని ఆ పార్టీకి 100లోపు సీట్లు కేటాయించాలని సమాజ్‌వాదీ పార్టీ భావిస్తున్నట్లు సమాచారం. కాంగ్రెస్‌కు 60 నుంచి 70 స్థానాలు ఇవ్వాలనే ప్రతిపాదనపై కూడా ప్రచారం జరుగుతోంది. అయితే, ఈ సంఖ్యలపై అధికారిక ధ్రువీకరణ లేదు. సీట్ల పంపకంపై ఇరు పార్టీల మధ్య తుది ఒప్పందం ఎలా కుదురుతుందన్నది రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ రేపుతోంది.

యూపీలో మొత్తం ఎన్ని అసెంబ్లీ స్థానాలు?... దేశ రాజకీయాల్లో అత్యంత కీలకమైన రాష్ట్రాల్లో ఉత్తరప్రదేశ్ ఒకటి. ఇక్కడ మొత్తం 403 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ఏ పార్టీకైనా కనీసం 202 స్థానాల్లో విజయం సాధించాలి. ప్రస్తుత అసెంబ్లీ పదవీకాలం 2027 మే 22తో ముగియనుంది. అందువల్ల తదుపరి ఎన్నికలు అంతకంటే ముందే నిర్వహించాల్సి ఉంటుంది.

ఎన్నికలు ఎప్పుడు జరగనున్నాయి?... 2027 ఫిబ్రవరి-మార్చి నెలల్లో ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశం ఉందని అంచనాలున్నాయి. అయితే, ఇప్పటి వరకు భారత ఎన్నికల సంఘం ఎటువంటి అధికారిక షెడ్యూల్‌ను ప్రకటించలేదు. పోలింగ్ తేదీలు, ఎన్ని విడతల్లో ఎన్నికలు నిర్వహిస్తారు, ఓట్ల లెక్కింపు ఎప్పుడు ఉంటుందనే వివరాలు త్వరలోనే వెల్లడి కావల్సి ఉంది. 2022లో ఉత్తరప్రదేశ్ ఎన్నికలు ఏడు విడతల్లో జరిగాయి. ఈసారి కూడా రాష్ట్రవ్యాప్తంగా విస్తరించిన నియోజకవర్గాలు, భద్రతా ఏర్పాట్లు, ఎన్నికల నిర్వహణ అవసరాలను బట్టి పోలింగ్ విధానాన్ని ఎన్నికల సంఘం నిర్ణయించనుంది.

కాంగ్రెస్-ఎస్పీ మధ్య సీట్ల పంచాయితీ?... 2027 ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీని బీఓడించాలనే లక్ష్యంతో సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్ కలిసి పోటీ చేయాలని భావిస్తున్నాయి. ఈ దిశగా విజయ అవకాశాలపై, సీట్ల సర్దుబాటుపై చర్చలు కొనసాగుతున్నాయి. అయితే, ఏ పార్టీ ఎన్ని స్థానాల్లో పోటీ చేయాలనే అంశం రెండు పార్టీల మధ్య ప్రధాన చర్చగా మారింది. తాజా మీడియా కథనాల ప్రకారం, కాంగ్రెస్ సుమారు 170 నియోజకవర్గాలతో కూడిన జాబితాను ఎస్పీకి అందించినట్లు సమాచారం. కొన్ని నివేదికల్లో కాంగ్రెస్ 175 నుంచి 200 స్థానాల వరకు కోరుకుంటున్నట్లు పేర్కొన్నాయి. అయితే, ఈ సంఖ్యలు చర్చల దశలో ఉన్నవే తప్ప, అధికారికంగా ఖరారైన సీట్ల కేటాయింపులు కావని రాజకీయవర్గాలు చెబుతున్నాయి. కాంగ్రెస్ తనకు బలమైన అభ్యర్థులు ఉన్న నియోజకవర్గాలు, పార్టీ సంస్థాగతంగా మెరుగ్గా ఉన్న ప్రాంతాలకు ప్రాధాన్యం ఇవ్వాలని చూస్తోంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లో ఆరు స్థానాలను గెలుచుకున్న ఫలితాన్ని కూడా తన వాదనకు ఆధారంగా చూపుతోంది. మరోవైపు, ఎస్పీ మాత్రం రాష్ట్రంలో తనకున్న బలాన్ని దృష్టిలో ఉంచుకుని ఎక్కువ స్థానాల్లో పోటీ చేయాలని భావిస్తోంది. కాంగ్రెస్‌కు సుమారు 60 నుంచి 70 స్థానాలు కేటాయించే ప్రతిపాదనను తెరపైకి తీసుకువచ్చినట్లు పార్టీవర్గాల్లో చర్చ మొదలైంది. అయితే, ఈ సంఖ్యలపై రెండు పార్టీలు తుది ఒప్పందానికి వచ్చినట్లు అధికారిక ప్రకటన రాలేదు.

బరిలో ఉండే ప్రధాన పార్టీలు ఏవి?... 1. భారతీయ జనతా పార్టీ (బీజేపీ): ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నాయకత్వంలో అధికారాన్ని నిలబెట్టుకోవాలని బీజేపీ లక్ష్యంగా పెట్టుకోనుంది. కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ కూటమి మద్దతు కూడా ఆ పార్టీకి కీలకం. 2. సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ): అఖిలేశ్ యాదవ్ నాయకత్వంలోని ఎస్పీ ప్రధాన ప్రతిపక్ష శక్తిగా బీజేపీకి సవాల్ విసరాలని చూస్తోంది. కాంగ్రెస్‌తో కలిసి పోటీ చేయడం ద్వారా ఓట్ల విభజనను తగ్గించుకోవడం కూటమికి కీలకం కావచ్చు. 3. కాంగ్రెస్: ప్రియాంక గాంధీ వాద్రా సహా పార్టీ నాయకులు సీట్ల పంపకం, అభ్యర్థుల ఎంపిక, రాష్ట్రంలో పార్టీ బలోపేతంపై దృష్టి సారిస్తున్నారు. ఎస్పీతో ఒప్పందం ఎంతవరకు కుదురుతుందన్నది ఎన్నికల సమీకరణాలను ప్రభావితం చేయవచ్చు. 4. బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ): మాజీ ముఖ్యమంత్రి మాయావతి నాయకత్వంలోని బీఎస్పీ కూడా కీలక రాజకీయ శక్తి. దళిత ఓటర్లలో పార్టీకి ఉన్న మద్దతు, ఇతర సామాజిక వర్గాలపై ప్రభావం ఎన్నికల ఫలితాల్లో పాత్ర పోషించవచ్చు. 5. ఎన్డీఏ భాగస్వామ్య పార్టీలు: రాష్ట్రీయ లోక్‌దళ్ (ఆర్ఎల్‌డీ), అప్నా దళ్ (సోనీలాల్), నిషాద్ పార్టీ, సుహెల్‌దేవ్ భారతీయ సమాజ్ పార్టీ (ఎస్‌బీఎస్‌పీ) వంటి పార్టీలు కూడా సీట్ల కేటాయింపులు, ప్రాంతీయ సామాజిక సమీకరణాల్లో ప్రాధాన్యం పొందే అవకాశం ఉంది. ఈ పార్టీలకు ఎన్ని స్థానాలు కేటాయిస్తారనేది ఇంకా ఖరారు కాలేదు. 6. ఇతర పార్టీలు: ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), ఆజాద్ సమాజ్ పార్టీ వంటి రాజకీయ శక్తులు కూడా తమ బలాన్ని బట్టి ఎన్నికల్లో పోటీ చేసే అవకాశముంది. అయితే, వాటి తుది వ్యూహాలు, కూటములపై స్పష్టత రావాల్సి ఉంది.

ప్రస్తుతానికి సీట్ల పంపకం, అభ్యర్థుల ఎంపిక, కూటముల తుది రూపంపై స్పష్టత రావాల్సి ఉంది. ఎన్నికల సంఘం అధికారిక షెడ్యూల్ ప్రకటించిన తర్వాతే పోలింగ్ తేదీలు, విడతలు, ఇతర ఎన్నికల వివరాలపై పూర్తి స్పష్టత లభించనుంది.

గత ఎన్నికల ఫలితాలు ఏం చెబుతున్నాయి?... 2022 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఒక్కటే 255 స్థానాలను గెలుచుకుంది. ఎస్పీ 111 స్థానాల్లో విజయం సాధించింది. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ మొత్తం 273 స్థానాలతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం ఉత్తరప్రదేశ్‌లో రాజకీయ చిత్రం కొంత మారింది. రాష్ట్రంలోని 80 లోక్‌సభ స్థానాల్లో ఎస్పీ 37, బీజేపీ 33, కాంగ్రెస్ ఆరు స్థానాలు గెలుచుకున్నాయి. ఈ ఫలితాలు 2027 అసెంబ్లీ ఎన్నికలకు ముందు పార్టీలకు ముఖ్యమైన రాజకీయ సంకేతాలుగా మారాయి. అయితే, లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల ఓటింగ్ సరళి ఒకేలా ఉంటుందని భావించలేము.

అఖిలేశ్ యాదవ్ ఏమంటున్నారు?... బీజేపీని ఓడించడమే తమ కూటమి ప్రధాన లక్ష్యమని అఖిలేశ్ యాదవ్ పేర్కొన్నారు. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, ఇండియా కూటమి కలిసి పనిచేయాలని, ప్రజలకు తమ ఉమ్మడి లక్ష్యాన్ని వివరించి ఎన్నికల్లో ముందుకు సాగుతామని ఆయన చెప్పారు. అయితే, కూటమి లక్ష్యం ఒక్కటే అయినప్పటికీ సీట్ల పంపకం విషయంలో పరస్పర అంగీకారం సాధించడం కీలకం. ఏ నియోజకవర్గంలో ఏ పార్టీకి గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి? అభ్యర్థుల బలం ఎంత? స్థానికంగా పార్టీకి ఉన్న సంస్థాగత మద్దతు ఏ స్థాయిలో ఉంది? అనే అంశాల ఆధారంగా చర్చలు సాగుతున్నాయి.

యూపీ ఎన్నికలపై దేశవ్యాప్తంగా ఆసక్తి ఎందుకు?... ఉత్తరప్రదేశ్‌లో 403 అసెంబ్లీ స్థానాలు ఉండటంతో ఇక్కడి ఫలితాలు దేశ రాజకీయాలపై కూడా ప్రభావం చూపగలవు. బీజేపీ అధికారాన్ని నిలబెట్టుకుంటుందా? ఎస్పీ--కాంగ్రెస్ కూటమి బలమైన పోటీ ఇస్తుందా? బీఎస్పీ ఎంత మేరకు ఓట్లను ప్రభావితం చేస్తుంది? ఎన్డీఏ భాగస్వామ్య పార్టీలు ఎన్ని స్థానాల్లో పోటీ చేస్తాయి? అన్న అంశాలపై ఆసక్తి నెలకొంది. మొత్తానికి.. 403 స్థానాలున్న ఉత్తరప్రదేశ్‌లో 2027 ఎన్నికలకు ముందే సీట్ల లెక్కలు మొదలయ్యాయి. కాంగ్రెస్ ఆశిస్తున్న స్థాయిలో సీట్లు దక్కుతాయా? ఎస్పీ తన పట్టును కొనసాగిస్తుందా? ఈ రెండు పార్టీల మధ్య ఒప్పందం బీజేపీకి ఎంతవరకు సవాల్ విసురుతుంది? అన్నది రాబోయే రోజుల్లో తేలనుంది.

పూజల అనంతరం చిలకం మధుసూదన్‌రెడ్డి ప్రచారం ప్రారంభం

పుట్టపర్తి, అక్టోబరు24, అమరావతి వెలుగు : జెడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం







మధుసూదన్‌రెడ్డి చెర్లోపల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. శనివారం తన సతీమణి చిలకం ఛాయాదేవితో కలిసి గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా గాజు గ్లాసు గుర్తుకు ఓటు వేసి తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రచారంలో భాగంగా గ్రామానికి చెందిన 105 ఏళ్లకు పైబడిన చెన్నారెడ్డిని చిలకం మధుసూదన్‌రెడ్డి ఆప్యాయంగా పలకరించి కొద్దిసేపు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి మార్కెట్ యార్డు చైర్మన్ పూల శివప్రసాద్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరామ్‌రెడ్డి, బీజేపీ మండల కన్వీనర్ విజయభాస్కర్‌రెడ్డి, టీడీపీ నాయకులు దేవానంద్‌రెడ్డి, బుక్కపట్నం మండల అధ్యక్షుడు అల్లాడి జయరాం, ఓడీసీ మండల అధ్యక్షుడు మేకల ఈశ్వర్, పుట్టపర్తి నియోజకవర్గ నాయకులు తోట్ల గంగాధర్, మీనా గణేష్‌తో పాటు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనసేన నుంచి వైసీపీలోకి...
సాయికృష్ణ యాదవ్

అనంతపురం, అక్టోబరు 24, అమరావతి వెలుగు : అనంతపురం నగరపాలక సంస్థ ఎన్నికల ప్రచారం నేపథ్యంలో నగరంలోని ఒకటో డివిజన్‌కు చెందిన జనసేన నాయకుడు



సాయికృష్ణ యాదవ్ తన మిత్ర బృందంతో కలిసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ అభ్యర్థి రమేష్ గౌడ్ పార్టీ కండువాలు కప్పి వారిని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు అనంత చంద్రారెడ్డి, నగర అధ్యక్షుడు చింతా సోమశేఖరరెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్, అమర్‌నాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ పాలనలో నగరాభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్లు వేసిన వైసీపీ శ్రేణులపై దాడులు జరగడం ఆందోళనకరమన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నగరంలో శాంతిభద్రతలు, అభివృద్ధి, ప్రజల ఆస్తుల రక్షణకు ప్రాధాన్యమివ్వాలని కోరారు. మేయర్ అభ్యర్థి రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. నగరంలో డ్రైనేజీ, రహదారులు, పారిశుద్ధ్య సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందించామని పేర్కొన్నారు. నగరాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన కోసం వైసీపీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ మాట్లాడుతూ.. పవన్‌కల్యాణ్‌ను నమ్మిన యువత నిరాశకు గురైందని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో సచివాలయ వ్యవస్థ, వాలంటీర్ల ద్వారా ప్రజలకు సేవలందించామని తెలిపారు. ప్రస్తుత పాలనలో నగరంలో కబ్జాలు పెరిగాయని ఆరోపించారు. మేయర్ అభ్యర్థి రమేష్ గౌడ్‌తో పాటు ఒకటో డివిజన్ అభ్యర్థి షెక్షావలి, నాలుగో డివిజన్ అభ్యర్థి ప్రణతిని గెలిపించాలని కోరారు. వైసీపీ సిద్ధాంతాలు నచ్చి జనసేనను వీడి పార్టీలో చేరినట్లు సాయికృష్ణ యాదవ్ తెలిపారు. రమేష్ గౌడ్, షెక్షావలి, ప్రణతిల విజయానికి కృషి చేస్తానని, వైసీపీ బలోపేతానికి తనవంతు ప్రయత్నం చేస్తానని చెప్పారు.

కౌంటింగ్‌కు ఇబ్బందులు లేకుండా..
ఏర్పాట్లు చేయాలి

అనంతపురం, అక్టోబరు24, అమరావతి వెలుగు : జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా



కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ అధికారులను ఆదేశించారు. శనివారం ఉరవకొండలోని ఎన్.కె. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేస్తున్న కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లను జిల్లా ఎస్పీ పి.జగదీష్, అసిస్టెంట్ కలెక్టర్ సుయాష్ కుమార్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్లు, కూడేరు మండలాలకు సంబంధించిన కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లలో ఏర్పాట్లను తనిఖీ చేశారు. ఒక్కో కౌంటింగ్ కేంద్రంలో కనీసం నాలుగు టేబుళ్లు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ఠ భద్రత కల్పించాలని, అవసరమైన చోట్ల బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కౌంటింగ్ సజావుగా జరిగేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో డీఎస్పీ బి.శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి, ఎన్నికల అధికారి సాలురెడ్డి, తహసీల్దార్ అరుణ, ఎంపీడీవో రవిప్రసాద్, సీఐ మహానంది తదితరులు పాల్గొన్నారు.

52వ వార్డులో దళవాయి కుమార్‌కు...
మద్దతుగా ప్రచారం

అనంతపురం , అమరావతి వెలుగు : నగరపాలక సంస్థ 52వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి దళవాయి కుమార్‌కు మద్దతుగా శ్రీ వెంకటరమణ స్వామి బోర్‌బండి అసోసియేషన్ సభ్యులు





ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దళవాయి పెద మారెప్ప ఆధ్వర్యంలో వార్డులో ఇంటింటికీ వెళ్లి కుమార్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ నియోజకవర్గ అభివృద్ధికి చేస్తున్న కృషిని, స్థానిక ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి ప్రోత్సాహాన్ని దృష్టిలో ఉంచుకుని దళవాయి కుమార్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. 52వ వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని ప్రచారంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వార్డులో తమ అభ్యర్థికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని, దళవాయి కుమార్ విజయం సాధిస్తారనే ఆశాభావాన్ని ప్రచారంలో పాల్గొన్న వారు వ్యక్తం చేశారు.

అపస్మారక స్థితిలో వ్యక్తి.. స్పందించని జనం!

ధర్మవరం, అక్టోబరు24, అమరావతి వెలుగు : పట్టణంలోని మై హోమ్ వద్ద ఓ వ్యక్తి రాత్రి నుంచి అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు శనివారం ఉదయం సామాజిక మాధ్యమాల్లో ప్రచారం కావడం





చర్చనీయాంశమైంది. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో వ్యక్తి దీనస్థితిలో ఉన్నా ఎవరూ స్పందించలేదా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఆపదలో ఉన్నవారికి సాయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యతని, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

27న పుట్టపర్తిలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా
ఓటు హక్కు వినియోగానికి ఏర్పాట్లు

పుట్టపర్తి, అక్టోబరు 24, అమరావతి వెలుగు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం (APSEC) జారీ చేసిన సూచనల మేరకు, మున్సిపల్ ఎన్నికల విధులకు నియమితులైన ఉద్యోగులు, పుట్టపర్తి పురపాలక సంఘం పరిధిలోని ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఈ నెల 27న పుట్టపర్తి మున్సిపల్ కార్యా లయంలో పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని కల్పించనున్నట్లు పుట్ట పర్తి పురపాలక సంఘం కమిషనర్ తెలిపారు. ఎన్నికల విధులకు నియమితులైన ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, నిర్దిత విధానంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

కుంటిమద్ది ఎంపీటీసీగా...
మజ్జిగ సుజాత ఏకగ్రీవ ఎన్నిక

రామగిరి, అక్టోబరు 24, అమరావతి వెలుగు : శ్రీ సత్యసాయి జిల్లా రాప్తాడు నియోజకవర్గం రామగిరి మండలం కుంటిమద్ది పంచాయతీ ఎంపీటీసీ స్థానానికి తెలుగుదేశం పార్టీ



మద్దతుతో శేషంపల్లి గ్రామానికి చెందిన మజ్జిగ సుజాత (మజ్జిగ ఆంజనేయులు భార్య) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలన, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, యువనేత పరిటాల శ్రీరామ్‌లకు ప్రజల్లో ఉన్న ఆదరణకు ఈ ఏకగ్రీవ ఎన్నిక నిదర్శనమని పార్టీ శ్రేణులు పేర్కొన్నాయి. తమపై నమ్మకంతో ఎంపీటీసీ బాధ్యతలు అప్పగించిన స్థానిక ప్రజలకు మజ్జిగ సుజాత దంపతులు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కుంటిమద్ది పంచాయతీ అభివృద్ధికి, శేషంపల్లి పరిధిలోని ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.

చెప్పిన హామీలను అమలు చేస్తున్నాం

పెనుకొండ, అక్టోబరు 24, అమరావతి వెలుగు : ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి



పనిచేస్తోందని బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత తెలిపారు. పెనుకొండలోని తన క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి 'చెప్పాం.. చేస్తున్నాం' పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అభ్యర్థి కేసవయ్య యాదవ్, మండల కన్వీనర్ ప్రసాద్, బూత్ ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు.

మద్దిలేరు వాగుకు రక్షణ గోడ నిర్మించాలి

కదిరి, అక్టోబరు 24, అమరావతి వెలుగు : పట్టణ నడిబొడ్డున ఉన్న మద్దిలేరు వాగును ఆక్రమణల నుంచి కాపాడాలని, వాగు ప్రారంభం నుంచి చివరి వరకు ఇరువైపులా రక్షణ గోడ నిర్మించాలని



సీపీఎం రాష్ట్ర నాయకుడు ఓబులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కదిరి మున్సిపాలిటీ 39వ వార్డు ఎన్నికల ప్రచారంలో భాగంగా సీపీఎం నాయకులతో కలిసి ఆయన మద్దిలేరు వాగును పరిశీలించారు. గతంలో భారీ వర్షాల సమయంలో వాగు ఉద్ధృతంగా ప్రవహించడంతో పరిసరాల్లోని పది వార్డుల ప్రజలు, ఇళ్లు నష్టపోయాయని ఓబులు తెలిపారు. అయినా ఇప్పటివరకు రక్షణ గోడ నిర్మించకపోవడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. విఠలరాయుని చెరువు, దేవర చెరువు, పంతుల చెరువుల నుంచి వచ్చే నీరు మద్దిలేరు వాగులో కలుస్తుందని, వరద ముప్పును దృష్టిలో ఉంచుకుని శాశ్వత రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. వాగులో చెత్తాచెదారం పేరుకుపోతోందని, హెచ్చరిక బోర్డులు ఉన్నప్పటికీ ప్రజలు చెత్త వేస్తున్నారని విమర్శించారు. చెత్తకు నిప్పు పెట్టడంతో వెలువడే పొగ వాహనదారులకు ఇబ్బందులు కలిగించడంతో పాటు ప్రమాదాలకు కారణమవుతోందని తెలిపారు. వాగును శుభ్రం చేసి, చెత్త వేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో అధికారంలో ఉన్న వైసీపీ, టీడీపీ ప్రభుత్వాలు వాగు పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోలేదని విమర్శించారు. 39వ వార్డు సీపీఎం కౌన్సిలర్ అభ్యర్థి ముస్తాక్ అలీ ఖాన్ వాగు పరిరక్షణతో పాటు వార్డు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని ఓబులు తెలిపారు. రక్షణ గోడ నిర్మాణం కోసం పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జి.ఎల్. నరసింహులు, నాయకులు సాంబశివ, రామ్మోహన్, బాబ్జాన్, నాగరాజు, సుధాకర్ రెడ్డి, శాంతిబాయి, ముస్తాక్ అలీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ అధికారులకు...
రెండో విడత శిక్షణ

అనంతపురం, అక్టోబరు 24, అమరావతి వెలుగు : రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికలు--2026 నిర్వహణలో భాగంగా ప్రిసైడింగ్ ఆఫీసర్లు (పీఓలు), అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లకు (ఏపీఓలు)



రెండో విడత శిక్షణ కార్యక్రమాన్ని శనివారం అనంతపురంలోని ఎన్‌హెచ్--44 సమీపంలోని నీలం రాజశేఖర్‌రెడ్డి కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించారు. నవంబరు 1న జరగనున్న పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ విధుల కోసం జిల్లా వ్యాప్తంగా నియమితులైన 1,654 మంది అధికారులకు రెండు బ్యాచ్‌లుగా శిక్షణ ఇచ్చారు. నోడల్ అధికారి, జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్ మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో అనుభవం ఉన్నవారైనా, తొలిసారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నవారైనా ఎన్నికల నిబంధనలు, విధివిధానాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. శిక్షణలో వివరించిన అంశాలపై పూర్తి అవగాహన పెంచుకుని, సందేహాలను నివృత్తి చేసుకోవాలని తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎన్. అయూబ్ హుస్సేన్ మాట్లాడుతూ పోలింగ్ సిబ్బంది నిష్పక్షపాతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడంలో కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. మాస్టర్ ట్రైనర్లు ఎస్. రోశయ్య, ఎర్రిస్వామి పోలింగ్ సిబ్బంది విధులు, సమన్వయం, ఎన్నికల నిర్వహణ ప్రక్రియ, అవసరమైన సామగ్రి, వివిధ ఫారాల వినియోగంపై స్లైడ్‌ల ద్వారా వివరించారు. మాస్టర్ ట్రైనర్లు నారాయణరెడ్డి, రవికుమార్‌తో పాటు వివిధ మున్సిపాలిటీల సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించాలి: త్రివేణి







ధర్మవరం, అక్టోబరు 24, అమరావతి వెలుగు :

పట్టణంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్యాశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సతీమణి త్రివేణి శనివారం ఐదు, 11వ వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల బీజేపీ అభ్యర్థులు సోమ్లా నాయక్, జూటూరు వెంకటేష్‌తో పాటు కూటమి తరపున మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పరిసె సుధాకర్‌ను అఖండ మెజారిటీతో గెలిపించాలని పట్టణ ప్రజలను కోరారు. ప్రచారంలో భాగంగా స్థానికులతో మాట్లాడిన త్రివేణి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు మద్దతు తెలిపి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థి దొడ్డెమ్మను...

అఖండ మెజారిటీతో గెలిపించాలి

ఓబుళదేవరచెరువు, అక్టోబరు 24, అమరావతి వెలుగు : పుట్టపర్తి నియోజకవర్గంలోని ఓబుళదేవరచెరువు మండలం సున్నంపల్లి ఎంపీటీసీ స్థానం నుంచి వైఎస్సార్‌సీపీ తరపున పోటీ చేస్తున్న దొడ్డెమ్మను అఖండ మెజారిటీతో గెలిపించాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ డీలర్ బయముతక శ్రీనివాసులు ఓటర్లను అభ్యర్థించారు. శనివారం పెద్దగుట్లపల్లి, మహమ్మదాబాద్ క్రాస్, సున్నంపల్లి గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బయముతక శ్రీనివాసులు మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి హయాంలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను గుర్తు చేశారు. 193 చెరువులకు నీరు అందించే కార్యక్రమం, జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారుల అభివృద్ధి, పుట్టపర్తి కేంద్రంగా శ్రీ సత్యసాయి జిల్లా ఏర్పాటు వంటి అంశాలను ప్రస్తావించారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకొని, రానున్న రోజుల్లో గ్రామాలు మరింత అభివృద్ధి చెందాలంటే వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మద్దతు పలకాలని కోరారు. సున్నంపల్లి ఎంపీటీసీ అభ్యర్థి దొడ్డెమ్మ (లక్ష్మన్న భార్య)కు ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ ప్రచార కార్యక్రమంలో రేపన రామాంజినేయులు, మాజీ ఎంపీటీసీ గంగులప్ప, వలిపి ఆదినారాయణ, వెంకటరెడ్డి, అశ్వర్థరెడ్డి, ఎస్. హరినాథ్‌రెడ్డి, మాజీ సర్పంచి ఎద్దుల సూర్యనారాయణ, (వంచిరెడ్డిపల్లి) పెద్దగుట్లపల్లికి చెందిన రవి, శివాజీ తదితరులు పాల్గొన్నారు



బుక్కపట్నంలో ఎంపీటీసీ నామినేషన్ల పరిశీలన...

తనిఖీ చేసిన కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

బుక్కపట్నం, అక్టోబరు 24, అమరావతి వెలుగు : శ్రీ సత్యసాయి జిల్లా బుక్కపట్నం ఎంపీడీవో కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఎంపీటీసీ నామినేషన్ల పరిశీలన ప్రక్రియను జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఏ. శ్యామ్‌ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. నామినేషన్ పత్రాల పరిశీలన తీరును, అభ్యర్థులు సమర్పించిన ధ్రువపత్రాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనల మేరకు నామినేషన్ల పరిశీలనను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి నామినేషన్ పత్రాన్ని చట్ట పరమైన మార్గదర్శకాలకు అనుగుణంగా క్షుణ్ణంగా పరిశీలించాలని రిటర్నింగ్ అధికారులకు సూచించారు. పరిశీలన ప్రక్రియలో అభ్యర్థులకు ఏవైనా సందేహాలు ఉంటే స్పష్టమైన వివరణ ఇవ్వాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ఠమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు.





జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేస్తా

: డాక్టర్ పల్లపు తిరుపతేంద్ర

పుట్టపర్తి, అక్టోబరు 24, అమరావతి వెలుగు : గతంలో జనసేన పార్టీలో కొనసాగిన తాను అనివార్య కారణాల వల్ల కొంతకాలం పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉన్నానని, ప్రస్తుతం తిరిగి పార్టీలో చేరిన నేపథ్యంలో పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని డాక్టర్ పల్లపు తిరుపతేంద్ర తెలిపారు. హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి నవీన్ నిశ్చల్, పార్లమెంట్ కమిటీ సభ్యుడు అమర్ కార్తికేయ సమక్షంలో డాక్టర్ పల్లపు తిరుపతేంద్ర, ఆంధ్ర పుట్టపర్తి సాయి చరణ్ జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డాక్టర్ పల్లపు తిరుపతేంద్ర మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేస్తూ, జనసేన అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ, పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు.





ఎన్నికలు ముగిసే వరకు ప్రజా సమస్యల

పరిష్కార వేదిక రద్దు

అనంతపురం, అక్టోబరు 24, అమరావతి వెలుగు : స్థానిక సంస్థల ఎన్నికలు ముగిసే వరకు అనంతపురం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలను రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు కలెక్టరేట్‌లో అర్జీలు సమర్పించేందుకు ప్రజలు రావద్దని సూచించారు. కలెక్టరేట్‌తో పాటు క్షేత్రస్థాయిలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కూడా రద్దు చేసినట్లు స్పష్టం చేశారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని కలెక్టర్ కోరారు.



ఈవీఎం గోదాములను పరిశీలించిన

కలెక్టర్ ఓ. ఆనంద్

అనంతపురం, అక్టోబరు 24, అమరావతి వెలుగు : భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపడుతున్న నెలవారీ తనిఖీల్లో భాగంగా అనంతపురం క్లాక్‌టవర్ సమీపంలోని పాత ఆర్డీవో



కార్యాలయం పక్కన ఉన్న ఈవీఎం గోదాములను జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ శనివారం ఉదయం పరిశీలించారు. అసిస్టెంట్ కలెక్టర్ సుయాష్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి మాలోలతో కలిసి గోదాముల భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాముల తలుపులకు వేసిన తాళాలు, సీల్స్ స్థితిని పరిశీలించారు. ఈవీఎంల రక్షణకు తీసుకుంటున్న చర్యలు, భద్రతా ప్రమాణాలు ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం అమలవుతున్నాయా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. గోదాముల వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. పోలీసుల లాగ్‌బుక్‌ను పరిశీలించి, భద్రతా విధుల నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. సీసీటీవీ నిఘా వ్యవస్థ పనితీరు, నిరంతర విద్యుత్ సరఫరా, అగ్నిమాపక పరికరాల అందుబాటుపై సమీక్షించారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ తనిఖీల్లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆనంద్, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ కనకరాజు, సీనియర్ అసిస్టెంట్ శామ్యూల్, బెంజ్‌మెన్ తదితరులు పాల్గొన్నారు.



అభ్యర్థుల ఎన్నికల ఖర్చులపై పకడ్బందీగా

ఆడిట్ నిర్వహించాలి

అనంతపురం, అక్టోబరు24, అమరావతి వెలుగు : జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎన్నికల ఖర్చులపై పకడ్బందీగా ఆడిట్ నిర్వహించాలని ఎన్నికల వ్యయ లెక్కల నోడల్ అధికారి, జిల్లా ఆడిట్ అధికారి వై. ఇందిరా సూచించారు. ఎన్నికల వ్యయ పర్యవేక్షణ బృందాలు సమన్వయంతో పనిచేస్తూ అభ్యర్థుల ఖర్చులపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. జిల్లా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని డీపీఆర్‌సీ సమావేశ మందిరంలో శనివారం జిల్లాలోని 31 మండలాలకు చెందిన ఎన్నికల వ్యయ లెక్కల పరిశీలకులు, సంబంధిత అధికారులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల ఖర్చుల నమోదు, లెక్కల నిర్వహణ, నివేదికల సమర్పణపై అవగాహన కల్పించారు. జడ్పీటీసీ అభ్యర్థులు గరిష్ఠంగా రూ. 8 లక్షలు, ఎంపీటీసీ అభ్యర్థులు రూ. 4 లక్షల వరకు మాత్రమే ఎన్నికల ప్రచారానికి ఖర్చు చేయాలని అధికారులు తెలిపారు. నిర్ణీత పరిమితులకు మించి ఖర్చు చేసినా, ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారికంగా నమోదు చేయని ఖర్చులపైనా ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. అభ్యర్థుల జాబితా ప్రకటించిన తేదీ నుంచి ప్రతి మూడు రోజులకు ఒకసారి ఎన్నికల ఖర్చుల వివరాలను అభ్యర్థి లేదా ఆయన ఎన్నికల ఏజెంట్ రిటర్నింగ్ అధికారికి సమర్పించాలని స్పష్టం చేశారు. ఇందుకోసం ప్రొఫార్మా-1, 2, 3, 4లను నిబంధనల ప్రకారం పూర్తి చేయడం, సంబంధిత రికార్డులను పకడ్బందీగా నిర్వహించడంపై శిక్షణ ఇచ్చారు. ప్రతి మండలంలో పోటీ చేస్తున్న అభ్యర్థుల ఖర్చులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాస్తవ వ్యయాలకు అనుగుణంగా లెక్కలు నమోదు చేయాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం-1994లోని సెక్షన్ 230-బి ప్రకారం ఎన్నికల ఫలితాలు ప్రకటించిన తేదీ నుంచి 45 రోజుల్లోగా తుది ఎన్నికల ఖర్చుల లెక్కలను సంబంధిత అధికారుల ద్వారా జిల్లా ఎన్నికల ప్రాధికారులకు సమర్పించాలని తెలిపారు. గడువులోగా లెక్కలు సమర్పించకపోయినా, ఖర్చుల వివరాల్లో అవకతవకలకు పాల్పడినా నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్, ఎన్నికల అకౌంటింగ్ అబ్జర్వర్ డీవీఎన్ కృష్ణ, జిల్లా అసిస్టెంట్ ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్, హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం. శైలజ, జిల్లా ప్రజాపరిషత్ విభాగం ఏవో వీరాంజనేయులు, సహకార శాఖ, జిల్లా ఆడిట్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





నోడల్ అధికారులు బాధ్యతగా..

ఎన్నికల విధులు నిర్వర్తించాలి

అనంతపురం, అక్టోబరు 24, అమరావతి వెలుగు : స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు నోడల్ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ తమకు అప్పగించిన విధులను బాధ్యతగా నిర్వర్తించాలని జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల జనరల్ అబ్జర్వర్ బి. స్మరణ్‌రాజ్ సూచించారు. శనివారం అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో నోడల్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఓ. ఆనంద్, జిల్లా ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్ సుబ్బరాజు, జిల్లా ఎస్పీ పి. జగదీష్ పాల్గొన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామగ్రి పంపిణీ, రిసెప్షన్ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని జనరల్ అబ్జర్వర్ సూచించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, నివేదికలను నిర్దిష్ట సమయంలో సమర్పించాలని అధికారులను ఆదేశించారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి సిబ్బంది మొదటి విడత ర్యాండమైజేషన్‌ను వెంటనే పూర్తి చేసి, మండల స్థాయిలో ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇవ్వాలన్నారు. ఈ నెల 30న మూడో విడత ర్యాండమైజేషన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితాను సిద్ధం చేసి, బ్యాలెట్ పత్రాల ముద్రణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ ముద్రణకు అవసరమైన ఏర్పాట్లు చేసి, ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా సంబంధిత మున్సిపాలిటీల్లో ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. మున్సిపల్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు అవసరమైన బ్యాలెట్ పెట్టెలను సిద్ధం చేయాలని, పోలింగ్ అధికారులకు సమన్వయంతో శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎఫ్ఎస్‌టీ, వీఎస్‌టీ బృందాలు తమ నివేదికలను ప్రతిరోజూ సమర్పించాలని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి అందిన ఫిర్యాదులు, కేసుల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లపై పోలీసు అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. మీడియా ధ్రువీకరణ, పర్యవేక్షణ కమిటీ నిబంధనల ప్రకారం రికార్డులు నిర్వహించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్తు, ఫ్యాన్లు, లైట్లు తదితర సదుపాయాలను ముందుగానే పరిశీలించి మరమ్మతులు పూర్తి చేయాలని, దివ్యాంగ ఓటర్ల సౌకర్యార్థం అవసరమైన వీల్‌చైర్లు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా ఎస్పీ పి. జగదీష్ మాట్లాడుతూ కొన్ని చెదురుమదురు ఘటనలు మినహా జిల్లాలో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగుతోందన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు ఇతర శాఖల నుంచి అవసరమైన సిబ్బందిని సమకూర్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల వ్యయ పరిశీలనపై ఎప్పటికప్పుడు నివేదికలు అందించాలని, వ్యయ రిజిస్టర్లను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్ సుబ్బరాజు తెలిపారు. సమావేశంలో డీఆర్వో ఏ. మాలోల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, రామ్మోహన్, పద్మావతి, మల్లికార్జునరెడ్డి, రమేష్‌రెడ్డి, వెంకటనారాయణ, వివిధ శాఖల నోడల్ అధికారులు, ఎన్ఐసీ డీఐఓ భారతి తదితరులు పాల్గొన్నారు.







జెడ్పీటీసీ నామినేషన్ల పరిశీలనను తనిఖీ చేసిన కలెక్టర్







కొత్తచెరువు, అక్టోబరు 24, అమరావతి వెలుగు : శ్రీ సత్యసాయి జిల్లా కొత్తచెరువులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన జెడ్పీటీసీ నామినేషన్ల పరిశీలన ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌తో కలిసి పరిశీలన తీరును సమీక్షించారు. ఈ సందర్భంగా నామినేషన్ పత్రాల పరిశీలనలో రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులకు కలెక్టర్ సూచించారు. అభ్యర్థులు సమర్పించిన అఫిడవిట్లు, ఓటరు జాబితా వివరాలు, డిపాజిట్ రసీదులు, రిజర్వేషన్ ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. నామినేషన్ల పరిశీలనలో ఏవైనా లోపాలు గుర్తిస్తే ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, ప్రక్రియను పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. పరిశీలన సమయంలో అభ్యర్థులు, వారి ఏజెంట్లకు అవసరమైన సూచనలు, వివరణలు అందించాలని తెలిపారు. కార్యాలయ పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

Edited, Printed, Published & Owned by : JANAPATI VENKATA RAMESH BABU, #1-1189-21A, NGO Colony, KADIRI - 515591, Anantapuramu (Dist.), AP (State) and Printed at M/s AK PUBLICATIONS, #1-1189-2A, NGO Colony, Kadiri - 515591, Anantapuramu (Dist), AP (State) and Published at #1-1189-21A, NGO Colony, Kadiri - 515591, Anantapuramu (Dist.), (A.P), Editor : JANAPATI VENKATA RAMESH BABU, RNI No. APTEL / 2022 / 85169, E-mail : amaravathivelugu@gmail.com, Cell: 9440814576